క్లుప్తంగా

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై పాత జాతీయ రహదారి వైపుగా ఇటీవల వెలసిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు ఇటీవల పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. దీంతో సంబంధిత వ్యాపారులు గురువారం స్వచ్ఛందంగా ఆక్రమణ స్థలంలో ఉన్న దుకాణాలను తొలగించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతబొమ్మాళి: విద్యుత్ లైన్ల మరమ్మతులు శుక్రవారం చేపడుతున్నారు. దీంతో సంతబొమ్మాళి, నౌపడ, బోరుభద్ర పరిసర గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఎం.శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నందిగాం: మదనాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.శంకరరావు తెలిపారు. దీనబంధుపురం, నౌగాం, దిమ్మిడిజోల, మదనాపురం, హర్దబడ, భర్తుపురం, కల్లాడ తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు. కొళిగాం, బిర్లంగి, తేలుకుంచి, హరిపురం, బొడ్డఖాళీ, బొడ్డబడ, కీర్తిపురం, పాయితారి ప్రాంతలకు విద్యుత్ ఉండదని చెప్పారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట పట్టణంలోని జలంతర హరిజన వీధిలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో ఎంపీపీ పాల్గొని రోగులకు ఆరోగ్యంపై సలహాలు, సూచనలు అందజేశారు. జెమ్స్ పీఆర్వోగోపి ఉన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని వినతి



ఈవో వీరభద్రస్వామికి పరిస్థితి వివరిస్తున్న రాజేష్

కవిటి: మండల కేంద్రం కవిటితోపాటు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించిందని.. దీన్ని సరిదిద్దాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు కవిటి పంచాయతీ ఈవో జి.వీరభద్రస్వామికి గురువారం వినతి పత్రం అందజేశారు. కవిటితో పాటు రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ, గొండ్యాలపుట్టుగ, కొత్తూరు, తొత్తిడిపుట్టుగ, పాడియాపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ, కొత్తపాలెం గ్రామాల్లో చాలామంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు.


మంచినీటి కోసం నిరీక్షణ



పవర్‌బోర్ వద్ద నీటి కోసం పెట్టిన ఖాళీ బిందెలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు సూదికొండ ప్రాంతం మంచినీటి ఎద్దడి నెలకొంది. పవర్ బోర్ నుంచి సక్రమంగా నీరు రాకపోవంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తహసీల్దార్లను కలిసిన డీలర్లు



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీలర్లు

కంచిలి: మండల నూతన తహసీల్దార్ వై.జయలక్ష్మిని మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. డీలర్లు నాగరాజు, ప్రసాద్, ధనుంజయ, తిరుపతి, రిషి, రాంబాబు, రమేష్, నాగేశ్వరరావు, శాంతి, జగన్, లోకనాథం, వెంకటరావు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలోని ఓ వీధిలో రోడ్డుపై మురుగునీరు





రోగాలు పంజా!

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం
- మంచం పట్టిన ప్రజలు



టెక్కలి ఆదిఆంధ్రావీధిలో పాఠశాలకు ఆనుకుని ఉన్న చెత్త నిల్వలు



టెక్కలి: శ్రీనివాసానగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఇచ్ఛాపురం రూరల్:

సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. జనం రోగాలతో మంచం పడుతున్నారు. రోగాలు ప్రబలడానికి పారిశుద్ధ్యం క్షీణించడమే కారణం. పలు గ్రామాల్లో రోడ్లపైనే చెత్త పేరుకుపోయి దర్శనమిస్తోంది. కాలువలు పారని పరిస్థితి. దీంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజల్ని రోగాల భారిన పడేస్తున్నాయి. డొంకూరు, ఈదుపురం, ధర్మపురం, బిర్లంగి, మశాఖపురం, తేలుకుంచి, మండపల్లి, లొద్దపుట్టి, ఎం.తోటూరు, భవానీపురం, బాలకృష్ణాపురం, కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో స్థానిక ప్రజలు తరచూ జ్వరాల భారిన పడుతూ చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇలా ఉంటే రోగాలు ప్రబలవా?

టెక్కలి: పారిశుద్ధ్య లోపంతో ప్రస్తుతం వ్యాధులు విజృంభిస్తున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో పలు ఖాళీ స్థలాల్లో మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. జనావాసాల మధ్యనే వేసిన చెత్త నిల్వలతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. కాలువల్లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు, ఈగలు విజృంభించి జనం అవస్థలు పడుతున్నారు.



ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఇలా..



టెక్కలి: అయ్యప్పనగర్‌లో ఇళ్ల మధ్యనే చెత్త నిల్వలు

సకాలంలో వైద్యులు రాక రోగుల అవస్థలు!

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సకాలంలో వైద్యులు రాకపోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. సీహెచ్‌సీకి గురువారం ఉదయం పది గంటలకే చాలామంది రోగులు చేరుకున్నారు. అయితే 11 గంటలైన వైద్యులు రాకపోవడంతో వారంతా అవస్థలకు గురయ్యారు. సీహెచ్‌సీకి రోజూ సుమారు 200 నుంచి 300 వరకు ఔట్‌పేషెంట్లు వస్తుంటారు. ఇంత ఎక్కువగా రోగుల తాకిడి ఉన్నప్పటికీ ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో సేవల నిమిత్తం వచ్చినవారంతా తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.



పడిగాపులు కాస్తున్న రోగులు

ప్రజారంజక పాలనలో మీరే వారధులు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు
- సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభం

కవిటి: ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సక్రమంగా అందించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో వేగవంతమైన పురోగతి సాధనతో ప్రజారంజకపాలనకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులే వారధులని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్‌తో కలిసి ప్రారంభించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనీలు శిక్షణలో పలు అంశాల్ని వివరించారు. ఎంపీడీఓ కె.శ్రీనివాస రెడ్డి, ఈఓపీఆర్‌ఆర్డీ శివాజీపాణిగ్రాహి పాల్గొన్నారు.



కవిటి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



పలాస:మాట్లాడుతున్న ఐ.వి.రమణ



సోంపేట: మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామస్థాయిలో పారిశుద్ధ్యం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రిఫ్రెష్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీల్లో గ్రీన్ అంబాసీడర్ల ద్వారా వీధులు పరిశుభ్రంగా ఉంచాలని, పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఆర్పీ ద్వారా పారిశుద్ధ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలను స్లైడ్స్ రూపంలో వివరించారు. రెండవ పూట సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాపాడాలి: ఎంపీపీ

కంచిలి: ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులైనటువంటి సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ యాక్టు–1994, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్, ఎల్‌ఈడీ లైట్స్ వంటి అంశాలపై ఎంపీడీవో వి.నీరజ, ఈవోపీఆర్డీ ఇ.రాంబాబు అవగాహన కల్పించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సోంపేట: గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ ద్వారా అందజేస్తున్న శిక్షణను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రామారావు అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రస్తుతం జ్వరాలు అధికంగా ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈఓపీఆర్డీ వెంకటేశ్వరులు, ఏఓ భాస్కరరావు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి

పలాస: పంచాయతీల్లో తక్షణమే పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 19 పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. అందుకు తగిన వనరులను సమీకరించుకోవాలని చెప్పారు. ఎంపీడీవో మెట్ట వైకుంతరావు, శిక్షకులు పి.సద్గుణరావు, కె.చిరంజీవులు ఉన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

వజ్రపుకొత్తూరు రూరల్: పర్యాటక కేంద్రాలుగా ఉన్న సముద్ర తీరాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు హెచ్చరించారు. 'తీరంలో భయం!' శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో సిబ్బంది, యువకులతో కలిసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీరంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా ఉంటుందని అన్నారు. బీచ్‌లలో మద్యపాన నిషేధం ఉన్నందున మందుబాబులు పోలీసుల హెచ్చరికలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే పర్యాటకులకు ఆకతాయిలు ఇబ్బంది కలిగిస్తే అటువంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏఎస్‌ఐ జిన్నారావు, సిబ్బంది ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్



తీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

సమగ్రంగా పశుగణన

టెక్కలి: సమగ్రంగా పశుగణన చేయాలని టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీవో సుదర్శన్‌దొర అన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరంభం కానున్న పశు గణన కార్యక్రమానికి సంబంధించి గురువారం టెక్కలి పశు సంవర్థక శాఖ డీడీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పశుగణనపై పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. పశువులు కలిగిన ప్రతీ ఇంటిని సందర్శించి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీ వి.జయరాజ్, నోడల్ అధికారి జి.నారాయణరావు, ఏడీలు రఘునాథరావు, కరుణాకర్, లోకనాథం, చంద్రశేఖర్, రవికృష్ణ, అప్పలస్వామి, పశు వైద్య సిబ్బంది అనిల్, శ్రీకాంత్, నాయకులు శేషు, లవకుమార్ ఉన్నారు.



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌దొర తదితరులు

ఎస్‌ఎంసీ ఎన్నికలను పరిశీలించిన డీఎస్పీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం, ముశ్చింద్ర, కేధారిపురం గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికలను కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు పరిశీంచారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని రూరల్ ఎస్‌ఐ లక్ష్మన్‌ను ఆదేశించారు. బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేయడం జరిగిందని, అలాగే ఈదుపురం కండ్రా వార్డు ఉన్నత పాఠశాలలో ఎన్నిక డ్రా కావడంతో టాస్ వేసేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించగా, దాన్ని ఒక వర్గం అడ్డుకోవడంతో అక్కడ కూడా ఎంపిక వాయిదా వేయడం జరిగిందని ఎంఈఓ కె.అప్పారావు తెలిపారు.



బాలకృష్ణాపురంలో ఎంఈవో అప్పారావుతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వైభవంగా ఆలయ ప్రతిష్ట

కంచిలి: కత్తివరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శైలపుత్రి సద్దమ్మతల్లి గ్రామదేవత ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు రెండు రోజులుగా వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారి విగ్రహ ప్రదర్శన, జలాధివాసం, విశేష పూజా కార్యక్రమాలను చేపట్టారు. వందలాది మంది మహిళలు పూర్ణ కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గురువారం అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి, పంచామృతాది విశేష అభిషేకాలు, ధాన్యాధివాసములు, పంచశయ్యాధివాసము, విశేష హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



పూర్ణకలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

రైల్వే గేటు వద్ద పాట్లు!

టెక్కలి: టెక్కలి గోపినాథపురంలో రైల్వే గేటు వద్ద రోడ్డు శిథిలమైంది. దీంతో వాహన చోదకులు పాట్లు పడుతున్నారు. రైల్వే ట్రాక్‌కు ఆనుకుని పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడే సమయంలో గోతుల్లోకి నీరు చేరి వాహనచోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.



రోడ్డుకు ఏర్పడిన భారీ గోతులు

12న వ్యాసరచన పోటీలు

నందిగాం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో తెలిపారు. సీనియర్ ఐఏఎస్ అధికారి షమ్‌షేర్ సింగ్ రావత్ సేవా సంస్థ పేరిట ఈ నెల 12న నందిగాం ఉన్నత పాఠశాలలో 'సమాజ వికాసంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. మండలపరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతం!

- టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాల్లో పోలీస్ పహరా నడుమ ఎన్నికలు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్ట మొదటిసారిగా జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. అయితే కొన్నిచోట్ల రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. టీడీపీ మద్దతుదారులను గెలిపించడానికి నేరుగా ఆయా మండల స్థాయి కార్యకర్తలు జోక్యం చేసుకోవడంతో ఈ ఎన్నికలకు సైతం రాజకీయ రంగు అంటుకుంది. టెక్కలి మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీస్ పహారా కనిపించింది. మొత్తం 88 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 68 పాఠశాలల్లో ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకున్నారు. 20 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో పోలీసు బందోమస్తున మధ్య ఎన్నికలు జరిగాయి. టెక్కలి ఎంఈవోలు డి.తులసిరెడ్డి, డి.చిన్నారావు పాఠశాలలను సందర్శించి ఎన్నికలను పర్యవేక్షించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో 70 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 69 పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వ్యవసాయ పనులకు కూలీలు వెళ్లిపోవడంతో బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికలు నిలిచిపోయాయి. ధర్మపురం, లొద్దపుట్టి, బిర్లంగి, మండపల్లి ఉన్నత పాఠశాలల్లో స్థానిక కూటమి నేతలు మద్దతుదారులను కూడదీసుకునే పనిలో పడ్డారు.

సోంపేట: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజు తెలియజేశారు. 79 పాఠశాలలకు గాను 66 చోట్ల ఏకగ్రీవంగా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. 13 పాఠశాలల్లో ఓటింగ్ ప్రక్రియ ద్వారా కమిటీ సభ్యులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సమగ్రశిక్షా ఏఎస్‌ఓ నళినికాంత్ మండలంలోని పలు పాఠశాలల్లో ఎన్నికలను పరిశీలించారు.

కంచిలి: మండలంలో 102 పాఠశాలలు ఉండగా 94 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎనిమిది పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. ప్రతి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకుగాను ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికలను సమగ్రశిక్షా ఏఎస్‌వో నళినీకాంత్ పరిశీలించారు.

పలాస: పలాస మండలంలోని 84 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు. బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్‌గా గర్తం తులసీరావు, వైస్ చైర్మన్‌గా జినగ ధనలక్ష్మి గెలిపొందారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ పాఠశాలలో 15 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్.బాలశంకరం, ఉపాధ్యక్షులుగా టి.జయంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంతబొమ్మాళి: మండలంలోని 103 పాఠశాలల్లో కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల చేత ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు పర్యవేక్షించారు.

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని 91 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 17 ఉన్నత పాఠశాలల్లో 13 చోట్ల చైర్మన్, వైస్ చైర్మన్లు ఏకగ్రీవం అయ్యారు. అలాగే తొమ్మిది ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిది చోట్ల ఏకగ్రీవంగా కార్యవర్గాలు నియమితులయ్యాయి. 65 ప్రాథమిక పాఠశాలలకు గాను 60 ఏకగ్రీవమైనట్లు ఎంఈవోలు వెంకటరమణ, దాశరధి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్ రామారావు తమ సిబ్బందితో చర్యలు తీసుకున్నారు. కొత్తపేట, మంచినీళ్లపేట, కొండవూరు, బైపల్లి, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు పాఠశాలల్లో బందోబస్తు నిర్వహించారు.

కవిటి: మండలంలో అన్ని యాజమాన్యాల పరిధిలో 102 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 89 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్టు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. 12 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది.

ఇచ్ఛాపురం: పట్టణంలో 11 మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు, మూడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వోన్నత, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లలో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించారు. వీటిలో మూడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్‌లో కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. మిగిలిన చోట్ల ఎన్నికలు జరిగాయి.

కాశీబుగ్గ: మందస మండలంలోని 125 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వీటిలో 25 పాఠశాలల్లో కార్యవర్గాలను ఏకగ్రీవంగా జరగ్గా.. మిగిలిన చోట ఎన్నిక ద్వారా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 24 పాఠశాలలు ఉన్నాయి.వీటిలో ఏడు ప్రాథమిక పాఠశాల ల్లో మాత్రమే ఏకగ్రీవంగా కార్యవర్గాలను ఎన్నుకోగా.. మిగిలిన చోట ఎన్నికలు జరిగాయి.



టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలకు పోలీస్ పహరా




ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో చేతులెత్తుతున్న పేరెంట్స్



కాశీబుగ్గ: మందస మండలం దున్నూరులో గెలిపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు



ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కార్యవర్గంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం లత



కంచిలి ప్రాథమిక పాఠశాలలో ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఎంఈఓ శివరాంప్రసాద్, సమగ్రశిక్షా ఏఎస్‌వో నళినీకాంత్



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి పాఠశాలలో ఎన్నిక ప్రక్రియ